ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



జోగులాంబ
గద్వాల
జిల్లా వార్తలు
సోమవారం 28 జూలై 2025



గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



విద్యార్థినులతో వివరాలు తెలుసుకుంటున్న మాజీమంత్రి హరీశ్‌రావు



వంట మనుషులతో మాట్లాడుతున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి

పురుగుల అన్నం..

- నాసిరకం కూరగాయలు వండిపెట్టినా నోరు మెదపొద్దు
- ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో అధికారులదే పెత్తనం
- వాస్తవ పరిస్థితిని బయటపెడితే విద్యార్థినులపై టార్చర్
- తల్లిదండ్రులతో మాట్లాడలేని దుస్థితి
- 111 మంది విద్యార్థినులకు అస్వస్థత
- శనివారం రాత్రి జిల్లా ఆసుపత్రికి తరలింపు
- పరామర్శించిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- గురుకుల పాఠశాల ఘటనపై కఠిన చర్యలు : కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్ టౌన్/కందనూలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఉయ్యాలవాడ మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో అరాచకంగా వ్యవహారం నడుస్తోంది. మేము పురుగుల అన్నం పెట్టినా తినాల్సిందేనని బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ విషయాలు బయట చెబితే మీపట్ల కఠినంగా వ్యవహరిస్తాం. మీ తల్లిదండ్రులకు కూడా ఇక్కడి విషయాలు చెప్పవద్దంటూ అక్కడ ఉన్న సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారీ తీస్తోంది. గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంటున్న దాదాపు 111మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురై శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం ఉన్నతాధికారులకు తెలిసినా గోప్యంగా ఉంచారు. గురుకులానికి కాంట్రాక్ట్ పద్ధతి ప్రకారం విజయ డైరీ నుంచి నాణ్యమైన పెరుగు అందించాల్సి ఉండగా ఇక్కడ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

వాస్తవ పరిస్థితి విరుద్ధంగా ఉంది. దాదాపు 700 మంది విద్యార్థినులు ఉన్న గురుకుల పాఠశాలలో చాలా మంది ఉదయం పూట పాలు తాగడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని ఇక్కడ ఉన్న యాజమాన్యం, కాంట్రాక్టర్లు కుమ్మక్కై మిగిలిన పాలల్లో తోడు వేసి చేసే క్రమంలోనే నాణ్యత లేక గురుకుల విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

ఇదిలా ఉండగా సంఘటనపై అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష నాయకులు కూడా స్పందించారు. ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, లక్ష్మారెడ్డిలు వేర్వేరుగా జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అనంతరం బీసీ గురుకులాన్ని సందర్శించి ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.

అన్నంలో పురుగులొస్తున్నాయ్..

గురుకుల పాఠశాలలో భోజన నాణ్యత విషయంలో తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ విద్యార్థుల పట్ల కక్షసాధింపు ధోరణిని అవలంబిస్తున్న విషయాన్ని ఆరోతరగతి చదువుకుంటున్న విద్యార్థిని మీడియాకు తెలిపింది. గురుకుల పాఠశాల ప్రాంగణంలో విషసర్పాలు తిరుగుతున్నా పట్టించుకునే వారు లేరని వాపోయింది. 15రోజుల క్రితం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆకస్మికంగా గురుకుల పాఠశాలను (మిగతా 6లో..)



నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీసీ గురుకుల విద్యార్థినులు

నల్లమల ఘాట్ రోడ్డులో కారు బోల్తా

- ఇద్దరికి తీవ్రగాయాలు



శ్రీశైలం ఘాట్ రోడ్డులో అదుపు తప్పిబోల్తా పడిన కారు

బ్రహ్మగిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతం శ్రీశైలం ఘాట్ రోడ్డులో వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి బోల్తా పడటంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బ్రహ్మగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బ్రహ్మగిరి ఎస్‌ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం... ఏడుగురు మిత్రులు కారులో మహబూబ్‌నగర్ నుంచి శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనం కోసం వెళుతుండగా, శ్రీశైలం- హైద్రాబాద్ ప్రధాన రహదారి బ్రహ్మగిరికి నాలుగు కిలో మీటర్ల దూరంలో పీనుగల గొంది సమీపంలో వేగంగా వెళు తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారు నడుపుతున్న రాజు (25), మిన్నుగౌడ్ (26)లకు తీవ్రగాయాలు కావడంతో వారిని స్థానిక ప్రైవేట్ అంబులెన్స్‌లో బ్రహ్మరిగి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేయించి వారిని మహబూబ్ నగర్‌కు పంపించి, కేసు నమోదు చేసి వాచారణ చేపడుతామని ఎస్‌ఐ తెలిపారు.

బీజేపీ మద్దతుతోనే తెలంగాణ ఏర్పాటు

- రాష్ట్ర అభివృద్ధి మా పార్టీతోనే సాధ్యం
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



గద్వాలలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

గద్వాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ మద్దతుతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని ఎస్‌వీ ఈవెంట్ హాల్‌లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు రాష్ట్ర సంపదను దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీలు ఇస్తుందని, ఎన్నికలు పూర్తయిన తర్వాత హామీలను గట్టెక్కిస్తుందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం రైతుబంధు, రుణమాఫీ, బోనస్ ఇస్తున్నారని, ఎన్నికలు పూర్తయిన తర్వాత అన్నీ బంద్ చేస్తారన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. అంతకు ముందు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందంటే అది కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అనే విషయం మరవొద్దని అన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల గదులు, వైకుంఠధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు వీటన్నింటికీ కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారం, గర్భిణీ, బాలింతలకు బలవర్ధకమైన ఆహారం పంపిణీ చేసేది కూడా కేంద్ర ప్రభుత్వమేనని వివరించారు. సన్నబియ్యం, పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు భోజనం పెడుతున్నది కేంద్రమేనని అన్నారు. వీటిన్నిటినీ ప్రజలకు వివరించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. గద్వాల అభివృద్ధి కుంటుపడిందని, కుర్చీ కోసం కొట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేసేవారిని గుర్తించాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి, మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు భరత్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు అక్కల రమాసాయిబాబు, బండల వెంకట్రాములు, జయలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, నాయకులు బల్గెర శివారెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులలకు పెరిగిన వరద

- 14 గేట్ల ద్వారా 54,500 క్యూసెక్కులు విడుదల 6

తిరుమల్‌రావు ఉపయోగించిన కారు సీజ్

- హతుడు తేజేశ్వర్ తొడ ఎముక, అన్న రక్తనమూనాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు
- నిందితురాలు ఐశ్వర్య జీపీఎస్ ట్రాకర్ స్వాధీనం 6

కురుమూర్తిరాయ ఆయకట్టుకు నీటి విడుదల



కురుమూర్తిరాయ లిఫ్టు వద్ద మోటార్లు ఆన్ చేస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి

మదనాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని కురుమూర్తిరాయ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు ఆదివారం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ముందస్తుగా రావడంతో మండలంలోని అన్ని లిఫ్టులను ప్రారంభించారన్నారు. ఇప్పటికే రైతులకు పెట్టుబడి కోసం రైతుభరోసా నిధులు ప్రతీ ఒక్కరికి విడుదల చేశామని తెలిపారు. నూతన రేషన్ కార్డులను అందించామని, ఎన్నికల హామీలను దాదాపుగా నెరవేర్చామన్నారు. కార్యక్రమంలో లిఫ్ట్ కమిటీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, మహేష్‌కుమార్, వెంకట్‌నారాయణ, జగదీష్, రవీందర్ రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్ కోటలో వీరగల్లు ప్రతిమ



పులిని వేటాడుతున్నట్లు ఉన్న వీరగల్లు ప్రతిమను పరిశీలిస్తున్న పరిశోధక సభ్యుడు బైరోజు శ్యామ్‌సుందర్ 7

లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్ష ప్రశాంతం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి విద్యావిభాగం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జీపీవో(గ్రామ పాలన అధికారి), లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఎంపిక కోసం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగింది. గంట ముందు నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గ్రామ పాలనాధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్ష ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జీపీవో పరీక్షకు మొత్తం 62 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 55 మంది హాజరయ్యారని, లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్ష కోసం 112 మంది అభ్యర్థులకు గాను 100 మంది హాజరయ్యార ని అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్, ఆర్డీవో, ఏడీ సర్వే తదితరులు ఉన్నారు.



స్కానింగ్ కోసం తెల్లవారుజాము నుంచే బారులు ప్రజలు

వారి తీరే వేరయా..

జనరల్ ఆసుపత్రిలో వైద్యం ఉత్తమాటే!

- అత్యవసర విభాగంలో అందుబాటులో లేని వైద్యులు 7
- అడ్మిషన్ కావాలంటే గగనమే
- శిక్షణ వైద్యులతో అరకొర సేవలు
- 23 రోజుల్లో హైదరాబాద్‌కు పంపిన కేసులు 194
- తెల్లవారుజాము నుంచే స్కానింగ్ కోసం బారులు
- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- అస్తవ్యస్తంగా మారిన శానిటేషన్ వ్యవస్థ

సగరులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం 7

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమయ్యేనా?

- ఆపరేషన్ స్మైల్ ద్వారా 43 మంది
- ఆపరేషన్ ముస్కాన్ ద్వారా జూలైలోనే 65 మందిని గుర్తించిన అధికారులు

గద్వాల క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో వివిధ దుకాణాలు, ఇటుక బట్టీలు, పంట పొలాల్లో బాలకార్మికులు అధికంగా పనిచేస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు ప్రభుత్వం ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్‌స్మైల్ పేరుతో తనిఖీలు నిర్వహించాలని సూచిస్తోంది. ఈ తనిఖీలలో కానీ అధికారులు భాగంగా కొంతమంది బాలకార్మికులను గుర్తించి చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ఏడాదికి ఒక్కసారి జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో తూతూ మంత్రంగా తనిఖీలు చేసి బాలకార్మికులను గుర్తించినట్లు రికార్డు చూపించుకుంటున్నారు తప్ప పూర్తి స్థాయిలో బాల కార్మికులను గుర్తించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

ముందుగానే సమాచారం..

జోగుళాంబ గద్వాల జిల్లాలో బాలకార్మికులు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటుక బట్టీల వద్ద, పత్తిచేనుల్లో, హోటళ్లతో పాటు ప్రముఖుల ఇళ్లలో బాల కార్మికులు ఉన్నారు. అధికారులు దాడులు చేసే సమాచారం ముందుగానే తెలుసుకొని బాలకార్మికులను తప్పించి ఆ తరువాత మళ్లీ వారిని పనిలో కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గట్టు, మల్దకల్ మండలాల నుంచి బాల కార్మికులను జిల్లా కేంద్రంలో పనిలో పెట్టుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాలు కొందరు పాఠశాల ఉపాధ్యాయులకు తెలిసినా చెప్పలేని స్థితిలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇప్పటివరకు గుర్తించింది వీరినే...

జిల్లాలో తప్పిపోయిన బాలకార్మిక, అక్రమ రవాణాకు గురైన చిన్నారులను రక్షించడానికి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ



ఆపరేషన్ ముస్కాన్‌లో బాలకార్మికులను గుర్తించిన అధికారులు(ఫైల్)

ఆదేశాలతో జూలై 1 నుంచి నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో బాలల పరిరక్షణ విభాగం, పోలీస్, కార్మికశాఖ ఆధ్వర్యంలో ఏడాదిలో రెండు సార్లు తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తించి బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో అపరేషన్ స్మైల్‌లో భాగంగా 2017లో 37 మంది, 2018లో 53 మంది, 2019లో 134 మంది, 2020లో 81 మంది, 2021లో 114 మంది, 2022లో 134 మంది, 2023లో 104, 2024లో 107 మంది బాలకార్మికులను గుర్తించారు. తాజాగా ఈ ఏడాది జనవరి 1నుంచి 31వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో కేవలం 43 మంది బాలకార్మికులను గుర్తించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే 2025 జూలై 1 నుంచి ఇప్పటివరకు ఆపరేషన్ ముస్కాన్-11 ద్వారా నిర్వహించిన దాడులలో కేవలం 65 మంది బాలకార్మికులను మాత్రమే గుర్తించారు. గతేడాడి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముష్కాన్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించి 107 మంది బాలకార్మికులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

కేసులు తప్పవు



బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు చేస్తాం. ఇప్పటికే పలువురు యజమానులపై గతంతో పాటు ఇప్పుడు కూడా కేసులు చేశాము. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో బాలకార్మికులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చింది, తనిఖీలు చేసి వారిని బడికి పంపేలా చర్యలు తీసుకుంటాం. చిన్నారుల తల్లిదండ్రులు కూడా పిల్లల భవిషత్ కోసం పనిలోకి కాకుండా బడికి పంపేలా చూడాలి.

\- వేణుగోపాల్, అసిస్టెంట్ లేబర్ అధికారి.



తలపడుతున్న నిజామాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి క్రీడాకారులు

మూడో రోజు హోరాహోరీ

- ఉత్కంఠగా అంతర్రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు
- సెమీ ఫైనల్‌కు చేరిన 8 జట్లు 6

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం

కేఎల్ఐ కాలువను పరిశీలించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి 7

మైసమ్మ దేవతను దర్శించుకున్న భక్తులు 6

సుంకేసులకు పెరిగిన వరద

» 14 గేట్ల ద్వారా 54,500 క్యూసెక్కులు విడుదల



సుంకేసుల డ్యాం నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

రాజోలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం పెరిగింది. ఆదివారం ఉదయం జలాశయానికి 48వేల క్యూసెక్కుల వరదనీరు వస్తుండటంతో సుంకేసుల డ్యాంలో 12గేట్ల ద్వారా 49వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రానికి వరద పెరగడంతో డ్యాంకు ఎగువ నుంచి 50వేల క్యూసెక్కులు వచ్చి చేరుతుందని, డ్యాం నుంచి 14గేట్ల ద్వారా 54,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారి మద్దిలేటిస్వామి తెలిపారు. డ్యాం నీటి సామర్థ్యం 292మీటర్లు కాగా, ప్రస్తుతం 290 మీటర్లుగా నమోదైంది. నీటినిల్వ 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.660 టీఎంసీ ఉందని తెలిపారు. కర్నూలు కేసీ కెనాల్‌కు 21,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

యువతను విస్మరిస్తున్న పాలకులు

» డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్



అమరచింతలో యువకులకు సభ్యత్వం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు

అమరచింత, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను పూర్తిగా విస్మరిస్తున్నాయని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేశ్ విమర్శించారు. ఆదివారం అమరచింతలో కొనసాగుతున్న డీవైఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మద్యం దుకాణాలు, బెల్టు షాపులకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చి యువతను పెడదారి పట్టడానికి ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. యువత అభ్యున్నతి కోసం పాటుపడుతూ అభ్యుదయ యువజన ఉద్యమాల సంఘటితం పరుస్తూ యువత సమస్యపై డీవైఎఫ్‌ఐ నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కోసం సంఘటితంగా పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు టి.రాఘవేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు చంటి, కర్ణాకర్, తిరుపతి, శివ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ దేవతను దర్శించుకున్న భక్తులు



అమ్మవారి సన్నిధిలో భక్తులు

పెద్దకొత్తపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతను ఈ ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి అమ్మవారికి ఆదాయం టికెట్ల ద్వారా రూ.19,770, హుండీ ద్వారా రూ.56,182 మొత్తం రూ. 75,952 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఒరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం



మంగనూర్‌లో ప్రధాన రహదారిపైకి ఒరిగిన ఉన్న విద్యుత్ స్తంభం

బిజినేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం ఒరిగి కిందపడేలా ఉండంతో ఎప్పుడు కిందపడి ఎలాంటి ప్రమాదం పొంచి ఉందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహబూబ్‌నగర్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం కావడంతో కర్ణాటక రాష్ట్రంతో పాటు నారాయణపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి శ్రీశైలానికి వందలాది వాహనాల్లో రాత్రింబవళ్లు వెళ్తుంటారు. 11కేవీ లైన్ కావడంతో వాహనాలపై విద్యుత్ స్తంభం పడితే జరగాని ప్రమాదం జరిగి తీవ్ర ఆస్తి ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉన్నందున సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగక ముందే స్తంభాన్ని తీసి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.

పురుగుల అన్నం..

(5వ పేజీ తరువాయి)

తనిఖీ చేసిన తర్వాత మూడు రోజుల పాటు నాణ్యమైన భోజనం అందించారని, ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని విద్యార్థిని వాపోయింది. మెనూ ప్రకారం భోజనం అందడం లేదని విద్యార్థినులు వాపోతున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

మహాత్మాజ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి పరామర్శించారు. విద్యార్థుల అస్వస్థత విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటిన హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్‌కు చేరుకొని, జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిను లతో నాగం మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు.

విద్యార్థినులకు చిన్నారెడ్డి పరామర్శ

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల గురుకల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్‌తో అస్వస్థ తకు గురైన విద్యార్థినులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పరామర్శించారు. ఆదివారం సాయంత్రం ఉయ్యలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించిన చిన్నారెడ్డి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇలాంటి సమస్య లు మళ్లీ రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మిని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, రాష్ట్ర బీసీ గురుకులాల కార్యదర్శి సైదులు, డీఎంహెచ్‌వో స్వ రాజ్య లక్ష్మి, అధికారులు ఉన్నారు.



నాగర్‌కర్నూల్ బీసీ గురుకుల పాఠశాల వద్ద విద్యార్థినుల తల్లిదండ్రులు

మా పిల్లలను టార్చర్ చేస్తున్నారు



గురుకుల పాఠశాలలో జరుగుతున్న అక్రమాల గురించి తల్లిదండ్రులకు చెప్పినా అక్కడి సిబ్బంది అనేక ఆంక్షలు విధిస్తున్నారు. వాస్తవాలు బయటపెట్టిన పిల్లలను టార్గెట్‌గా చేసి వారిని టార్చర్ చేస్తున్నారు. వారి వేధింపులకు మా పిల్లలు బలవుతున్నారు. మానసిక పరిస్థితి కూడా సక్రమంగా ఉండడం లేదు.

- లక్ష్మీ, బిజినేపల్లి



విద్యార్థినులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి

గురుకుల పాఠశాల ఘటనపై కఠిన చర్యలు

» కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలో ఉన్న మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రాథమిక విచారణ ఆధారంగా క్యాటరింగ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తూ డిప్యూటీ వార్డెనపై శాఖపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పాఠశాల సమర్థవంతమైన నిర్వహణ కోసం త్వరలోనే కొత్త ప్రిన్సిపాల్‌ను నియమించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన చెందాల్సినవసరం లేదని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడానికి అవసరమైన అన్ని చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టిందని కలెక్టర్ ఆదివారం కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు.

మూడో రోజు హోరాహోరీ

» ఉత్కంఠగా అంతర్రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

» సెమీ ఫైనల్‌కు చేరిన 8 జట్లు



సెమీ ఫైనల్ మ్యాచ్ నందు నిజామాబాద్‌పై గెలుపొందిన మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా క్రీడాకారులు

అయిజ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్‌పోటీలు మూడు రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామంలో కొనసాగుతున్న పోటీల్లో సత్తా చాటి ఎనిమిది జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. ఈ మ్యాచ్‌లను పులకుర్తి శ్రీనాథ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బాస్కెట్ బాల్ అనే ఆట ప్రధాన నగరాలలో మాత్రమే కనిపిస్తుందని, కోర్టు ఖర్చుతో కూడుకున్నది కావటంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈ ఆట సాధ్యం కాదన్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఈ ఆటను పరిచయం చేయటమే లక్ష్యంగా మాజీ ఎంపీపీ దివంగత తిర్మల్‌రెడ్డి ఇక్కడ కోర్టు ఏర్పాటు చేయించారని చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే తాను ముందుకు వచ్చి సింథటిక్ కోర్టు ఏర్పాటుకు రూ.7 లక్షలు ఇచ్చి సహకరించానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల తిమ్మారెడ్డి, నిర్వాహకులు గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సమరసింహారెడ్డి, నీలొద్ది నాగేష్, చిన్న శీను, శేషన్న పాల్గొన్నారు.

ప్రీఫైనల్, క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల విజేతలు వీరే..

ప్రీఫైనల్ బాలికల విభాగంలో ఖమ్మం జట్టు హనుమకొండ జట్టుపై 24 పాయింట్ల ఆధిక్యంతో, మహబూబ్‌నగర్ జట్టు వరంగల్‌పై 33 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందాయి. ప్రీ క్వార్టర్ ఫైనల్‌లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు నిజామాబాద్‌పై 12 పాయింట్ల ఆధిక్యంతో, రంగారెడ్డి జట్టు మహబూబ్‌నగర్‌పై 8 పాయింట్ల ఆధిక్యంతో, వికారాబాద్ జట్టు ఖమ్మంపై 17 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందాయి.



బాల్ కోసం తలపడుతున్న నిజామాబాద్, వరంగల్ బాలుర జట్టు క్రీడాకారులు

బాలుర విభాగం ప్రీ క్వార్టర్ ఫైనల్‌లో సూర్యాపేట జట్టు కరీంనగర్‌పై 19 పాయింట్ల ఆధిక్యంతో, మహబూబ్‌నగర్ జట్టు జోగుళాంబ గద్వాల జట్టుపై 18 పాయింట్లు, మెదక్ జట్టు జగిత్యాలపై 1 పాయింట్ ఆధిక్యంతో, నిజామాబాద్ జట్టు వరంగల్‌పై 10 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందాయి. అలాగే ప్రీ క్వార్టర్ ఫైనల్ విభాగంలో మహబూబ్‌నగర్ జట్టు సూర్యపేటపై 10 పాయింట్ల ఆధిక్యంతోను, హైదరాబాద్ జట్టు మహబూబ్‌నగర్ జట్టుపై 59 పాయింట్లు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జట్టు మెదక్‌పై 24 పాయింట్ల ఆధిక్యంతో గెలుపొందాయి. బాలుర విభాగంలో మెదక్ 35 పాయింట్లు రాగా జగిత్యాలకు 24 పాయింట్లు వచ్చాయి. 1 పాయింట్ తేడాతో మెదక్ జట్టు గెలుపొంది ఉత్కంఠకు తెరదించింది.

హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధి కృషి చేద్దాం

» టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి



ఎన్నికైన ఉమ్మడి పాలమూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కమిటీ

జడ్చర్ల, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : హ్యాండ్ బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేద్దామని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, పీడీ అండ్ పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూమర్ల నిరంజన్ పిలుపునిచ్చారు. జడ్చర్ల మండలం పోలేపల్లి టీఎస్‌ఐఐసీ ప్రాంగణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గ స్థాయిలో హ్యాండ్‌బాల్ కోచింగ్ క్యాంపులు నిర్వహించి, గ్రామీణ స్థాయికి విస్తరించే విధంగా కృషి చేద్దామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా తకియొద్దీన్, ప్రధాన కార్యదర్శిగా శంకర్‌నాయక్, కోశాధికారిగా కాల్వ రాంరెడ్డి, పోషకులుగా హర్షవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్, మణ్యం, షోయబ్‌అలీ, రమణ, సంయుక్త కార్యదర్శులుగా అశోక్, ఉమాశంకర్, యాదయ్య, మొగులాల్, ఇంతియాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అభిలాష్, నరసింహతో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

లింక్‌రోడ్డుపై నడవడం నరకమే

» భగీరథ పైపులైన్ కోసం తవ్వి అసంపూర్తిగా వదిలిన వైనం

» ఇబ్బందుల్లో ప్రజలు



గుంతలమయంగా మారిన రోడ్డు

కల్వకుర్తి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఈ రోడ్డుపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. ఎర్రటి బురద రోడ్డుపై నడుస్తుంటే ఎక్కడో జారి పడుతామోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఎల్‌ఐసీ ఆఫీస్ వెనక భాగంలో సివిల్ సప్లయ్ గోదాము ముందు గల పదవ వార్డు అంతర్గత రహదారి మోడల్ డిగ్రీ కళాశాలకు, రైతు వేదికకు, డబుల్ బెడ్రూం ఇళ్లకు, టీఎన్‌జీవో కాలనీకి, వసతి గృహానికి వెళ్లడానికి లింకు రోడ్డుగా ఉంది. ఈ మట్టి రోడ్డు మధ్యలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వి పూర్తిస్థాయిలో పూడ్చలేదు. వర్షం పడడంతో ఎర్రటి బంకమట్టిలా మారి ఈ రోడ్డుపై నడవడం నరకాన్ని తలపిస్తోంది. కాలనీవాసులు తమ ఇళ్లల్లోకి వెళ్లడానికి, కళాశాలకు, వసతి గృహాలకు, టీఎన్‌జీవో కాలనీ, డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లే స్థానికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎర్రటి మట్టి రోడ్డు జారుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై బైక్ నడుపుతూ కొంతమంది జారిపడ్డ సంఘటనలు ఉన్నాయి. డిగ్రీ కళాశాలకు, హాస్టళ్లకు వెళ్లే విద్యార్థులు, ఆయా కాలనీలకు వెళ్లే ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి జారుతున్న ఎర్రమట్టిలో నడవడానికి ఇబ్బందిగా మారిన రోడ్డును మొరం పోసి చదును చేసి సీసీ రోడ్డుగా మార్చాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే రోడ్డును మరమ్మతులు చేయాలి



మట్టి రోడ్డు మధ్యలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం తవ్వి అసంపూర్తిగానే పూడ్చి వదిలేశారు. వర్షం రావడంతో ఎర్రటి బంక మట్టితో ఉన్న రోడ్డుపై నడవడానికి రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎర్రటి బంక మట్టి రోడ్డుపై మొరం పోసి మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- ఎన్.ముత్యాలు

సీసీ రోడ్డును నిర్మించాలి



ఎర్రటి బంక మట్టితో ఉన్న రోడ్డుపై వర్షం వస్తే నడవడానికి నరకం అనుభవిస్తున్నాం. డిగ్రీ కళాశాల, వసతి గృహాలకు, ఇతర కాలనీలకు లింకు రోడ్డుగా ఉన్న ఈ రహదారిని అధికారులు వెంటనే స్పందించి సీసీ రోడ్డు నిర్మించి శాశ్వత పరిష్కారం చూయించాలి.

- డి.రాధాకృష్ణ, కాలనీవాసి

చారకొండలో ఘనంగా పీర్ల పండగ



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

చారకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చారకొండ మండల కేంద్రంలో పీర్ల పండగను కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చారకొండలోని మసీదు వద్ద నిర్వాహకులు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. అగ్నిగుండం చుట్టూ గ్రామస్థులు, యువకులు అలాయ్ ఆడారు. తెల్లవారుజామున నిర్వాహకులు ఇమామ్ కాసీం, బారీం పీర్లను గ్రామంలోని పుర వీధుల్లో చప్పుళ్ల నడుమ ఊరేగించారు. గ్రామస్థులు పీర్లకు కొత్త దట్టీలు, ఊదు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జెల్ల రాముగౌడ్, గుండె స్కైలాబ్ గౌడ్, జెల్ల వెంకటయ్యగౌడ్, గుండె వెంకటయ్యగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తిరుమల్‌రావు ఉపయోగించిన కారు సీజ్

» ఫోరెన్సిక్ ల్యాబ్‌కు హతుడు తేజేశ్వర్ తొడ ఎముక, సోదరుడి రక్తనమూనాలు

» నిందితురాలు ఐశ్వర్య జీపీఎస్ ట్రాకర్ స్వాధీనం

గద్వాల క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను విచారణలో రోజురోజుకూ కీలక విషయాలు బయటకు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం తేజేశ్వర్ హత్య కేసులో ఏ1. తిరుమల్‌రావుతో పాటు ఏ2 ఐశ్వర్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా తేజేశ్వర్ హత్యకు సంబంధించి పూర్తిస్థాయిలో వివరాలను సేకరించేందుకు అన్ని కోణాల్లో పోలీసులు పరిశీలిస్తున్నారు. అయితే పెళ్లికి ముందు నుంచి ఐశ్వర్యకు ఇతర వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయనే ఉద్దేశంతో, ఆమె ఎక్కడెక్కడికి వెళ్తుంది... ఎవరితో ఉంటుంది అనే విషయాలపై అనుమానం పెంచుకున్న తిరుమల్‌రావు ఆమె స్కూటీకి జీపీఎస్ ట్రాకర్‌ను బిగించాడు. అయితే కస్టడీలో ఉన్న తిరుమల్‌రావు ఈ వివరాలను వెల్లడించడంతో ఆదివారం పోలీసులు ఆ జీపీఎస్ ట్రాకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు గతనెల 17న సర్వేయర్ తేజేశ్వర్‌ను హత్యచేసిన అనంతరం కారులో ఉన్న ఏ3, నాగేశ్, ఏ4 పరుశురామ్, ఏ5.రాజుల బట్టలపై రక్తపు మరకలు పడిన విషయం తెలిసిందే. అంతేకాకుండా డ్రైవర్ సీటులో ఉన్న నాగేష్ తేజేశ్వర్‌ను గొంతుకోసి చంపేక్రమంలో నాగేష్ చేతిలో ఉన్న కత్తిని లాక్కొని నాగేష్‌పై దాడిచేయడంతో చేతికి గాయమైంది. ఈ క్రమంలో తేజేశ్వర్‌ను చంపిన వెంటనే తిరుమల్‌రావుకు ఫోన్ చేయడంతో నేరుగా రాకండని వారిని పంచలింగాల సమీపంలో ఉన్న మురళి వెంచర్‌లో ఉన్న మామిడితోటలోకి రమ్మని చెప్పాడు. అక్కడ తేజేశ్వర్ మృతదేహంతో పాటు మీరు ముగ్గురు కారులో అక్కడికి వెళ్లారు. అయితే కర్నూల్ నుంచి తిరుమల్‌రావు ముగ్గురు రక్తపు మరకలతో ఉన్న బట్టలను మార్చుకోవడానికి కొత్తబట్టలు తెచ్చారు. అంతేగాక నాగేశ్‌కు చేతికి గాయమవడంతో తన కారులోనే కర్నూల్‌లోని గాయత్రి ఎస్టేట్‌కు తీసుకొని అక్కడ ఉన్న ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. తిరిగి మామిడితోటకు తీసుకొచ్చి వదిలివెళ్లాడు. వీరు శవంతో కర్నూల్ దాటేదాకా వారి వెంటే ఉండి తర్వాత తిరుమల్‌రావు ఏపి 39.బిఎల్. 0652 అనే కారులో నేరుగా హైదరాబాద్‌లోని చింతలపల్లిలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకున్నాడు. పోలీసుల విచారణలో ఈ కారు గురించి తెలియడంతో ఆదివారం ఆ కారును పోలీసులు సీజ్ చేసి గద్వాలకు తీసుకొచ్చారు. అంతేగాకుండా తేజేశ్వర్ తొడ ఎముకను, తేజేశ్వర్ అన్న తేజవర్ధన్ రక్త నమూనాలను డీఎన్‌ఏ పరీక్ష కోసం హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను నిందితుల నుంచి పూర్తి స్థాయిలో వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తున్నది.



తిరుమల్‌రావు ఉపయోగించిన కారును సీజ్ చేసిన పోలీసులు

క్రైం కార్నర్

గొర్రెల మందపై చిరుత పంజా

▸ అడ్డుకోబోయిన కాపరితో పాటు ఇద్దరిపై దాడి



చిరుత దాడిలో గాయపడ్డ సత్యనారాయణరెడ్డి



చిరుత దాడిలో మృతి చెందిన గొర్రెలు

కోయిలకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల మందపై చిరుత పులి దాడి చేసింది. అడ్డుకోబోయిన కాపరితో పాటు మరో ఇద్దరిపై దాడి చేసి గాయపరిచింది. ఈ సంఘటన మహబుబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం కొతలాబాద్‌లో శనివారం రాత్రి జరిగింది. అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోతలాబాద్ గ్రామానికి చెందిన గొల్ల మైబన్న శనివారం రాత్రి తన గొర్రెలను గ్రామ సమీపంలోని కుమ్మరికుంట సమీపంలోని పులిగుట్ట వద్ద నిలిపాడు. రాత్రి 10 గంటల సమయంలో గొర్రెల మందపై చిరుతపులి దాడి చేసింది. ఆ అలజడికి సమీపంలోనే ఉన్న కాపరి మైబన్నతో పాటు గ్రామానికి చెందిన చెన్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి అప్రమత్తం అయ్యారు. కుక్కలు దాడి చేస్తున్నాయని భావించిన మైబన్న మందలోకి వెళ్లి బ్యాటరీ వేసి చూస్తుండగా, చిరుత అతడిపై దాడి చేసింది. మిగిలిన ఇద్దరు కూడా మందలోకి వెళ్ళగా వారిపైనా దాడి చేసింది. మైబన్న చేతిపై, చెన్నారెడ్డి కాలిపై, సత్యనారాయణ రెడ్డి గొంతుపై గాయాలయ్యాయి. దీంతో వారు గట్టిగా కేకలు వేయడంతో చిరుత గుట్టపైకి వెళ్లిపోయింది. తర్వాత మందలోకి వెళ్లి చూడగా 3 గొర్రెలు చనిపోయి కనిపించాయి. మరో గొర్రె గాయపడింది. సమాచారం అందుకున్న అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్, స్థానిక ఎస్‌ఐ తిరుపాజీ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించి పరిస్థితిని సమీక్షించారు. అటవీ శాఖ అధికారులు పులిగుట్ట మీదకు వెళ్లి గాలించగా, బ్యాటరీ వెలుగులో పరిశీలించగా చిరుత కనిపించింది. దానిని బంధించేందుకు గుట్టపై బోను ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలను అమర్చారు. గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య

మాగనూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మాగనూరు మండలంలోని మందిపల్లి చెందిన కురువ సాబన్న (52) ఆదివారం ఉదయం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కురువ సాబన్న భాగస్తుల మధ్య పొలం వద్ద ఘర్షణ జరగడంతో మనస్థాపానికి గురై చెట్టుకు ఉరేసుకొని ఉరేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

కృష్ణ , జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తేనేటీగల దాడి ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద రోడ్డు పక్కన ఉన్న చింతచెట్టుకు పెద్ద తేనేటీగలు లేచి హిందూపూర్ తిమ్మప్ప, కృష్ణ గ్రామానికి చెందిన యువకుడికి దాడి చేశాయి. తల, మెడ, వెన్ను, చేతులు, కాళ్లపై కుట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు యువకుడిని ప్రైవేటు ఆసుపత్రి తరలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మక్తల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున దాసర్‌పల్లి శివారులో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి దాసర్‌దొడ్డికి చెందిన కటికెలి భాస్కర్, కటికెలి చంద్రశేఖర్ ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెండు ఇసుక టిప్పర్లు..

మరికల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనివారం అర్ధరాత్రి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లు ట్యాస్ ఫోర్స్ పోలీసులు రాకొండ గ్రామ శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సవారి అశోక్, గడ్డం పవన్‌కుమార్‌పై కేసు నమెదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాహత్యం

గండీడ్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటం ఆదివారం మండలంలోని చెలిమిల్ల గ్రామంలో చోటు చేసుకుంది.

గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోహన్ మనస్తాపంతో గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం

▸ ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



గుండాల వద్ద కేఎల్ఐ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని, పంటల సాగుకు అవసరమైన సాగునీటిని అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుండాల సమీపంలో డీ 82 కేఎల్ఐ కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంరోజుల క్రితం కొల్లాపూర్ వద్ద సాగునీటిని విడుదల చేశామని తెలిపారు. కాలువలోని ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. త్వరలోనే మండలానికి సాగునీరు వస్తుందని అన్నారు. ఇటీవల రైతులకు పెట్టుబడి సాయంగా రైతుభరోసా వేశామని, ఎటువంటి ఇబ్బంది పడకుండా సాగు సవ్యంగా సాగేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, వెంకటయ్యగౌడ్, జయప్రకాష్, పర్వత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హన్మంతునాయక్, తిరుమల్‌రావు, రషీద్, హరికిషన్, కాడురాం ఉన్నారు.

వారి తీరే వేరయా..

జనరల్ ఆసుపత్రిలో వైద్యం ఉత్తమాటే!

- అత్యవసర విభాగంలో అందుబాటులో ఉండని వైద్యులు
- అడ్మిషన్ కావాలంటే గగనమే
- శిక్షణ వైద్యులతో అరకొర వైద్యసేవలు



రాత్రి పూట డీఎంవో, సీఎంవోలు లేని క్యాజువాలిటీ పరిస్థితి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఆపద్బాంధవుడిగా వైద్యసేవలందించాల్సిన జనరల్ ఆసుపత్రికి సుస్తి చేసింది. ఇక్కడ వైద్యసేవలు అందడం లేదు. ముఖ్యంగా అత్యవసర విభాగంలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. రాత్రి అయ్యిందంటే చాలు డీఎంవోలు, సీఎంవోలు, విభాగాధిపతులు ఎవ్వరు కనిపించరు. పొరపాటున అడ్మిషన్ చేయాల్సి వస్తే మాత్రం గంటల తరబడి ఆగాల్సిందే. ఎందుకంటే అక్కడ ఉండేది శిక్షణ పొందే డాక్టర్లే. వారే అనుభవలేమితో వైద్యం అందిస్తున్నారు. వచ్చిన ప్రతీ కేసును హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నా రు. ఏదోలా అక్కడికైనా వెళ్దామనుకుంటే అంబులెన్సులు సమయానికి రావు. ఎవరు ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు వెళ్తన్నారో తెలియడం లేదు. ఒక్కరు కూడా సమయపాలన పాటించడం లేదు. శానిటేషన్ వ్యవస్థ అధ్వానంగా మారింది. దీనంతటికి కారణం ఆసుపత్రికి పెద్ద దిక్కు లేకపోవడమే. ఇటీవల పదోన్నతిపై వెళ్లిన సూపరింటెండెంట్ స్థానంలో ఇన్‌చార్జిలను నియ మించడం, వారు ఆఫీసుకే పరిమితం కావడంతో ఆసుపత్రి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది.



వీల్ చైర్ లేకపోవడంతో ప్లాస్టిక్ కుర్చీలో తీసుకెళుతున్న రోగి బంధువులు

అత్యవసర విభాగంలో అందుబాటులో లేని డాక్టర్లు...

ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలో సీఎంవో(క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్), డీఎంవో(డ్యూటీ మెడికల్ ఆఫీసర్), ఆయా విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదు. సాయంత్రం నుంచి మరుసటి రోజు 10 గం టల వరకు డాక్టర్లు ఉండడం లేదు. దీంతో శిక్షణ పొందే డాక్టర్లు మాత్రమే ఉంటున్నారు. వారు కూడా అనుభవలేమితో వైద్యం అందిస్తున్నారు. ఈనెల 22న హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం బైక్‌పై నుంచి కింద పడి అదే రోజు ఉదయం 8 గంటలకు ఎమర్జెన్సీకి వచ్చారు. అందులో ఒక వ్యక్తి(భర్త) చేయి విరిగిపో యింది. మరో (భార్య) పక్కటెముకలు విరగిపోయి త ల్లడిల్లుతున్నారు. ఒక్కరు కూడా పట్టించుకోలేదు. కనీసం గాయాలకు డ్రెస్సింగ్ కూడా చేయలేదు.

అడ్మిషన్ కావాలంటే గగణమే...

ఈనెల 22న ఏనుగొండ గ్రామానికి చెందిన బాలమణి అనే రోగికి తీవ్ర కడుపు నొప్పి, వాంతులు, విరేచ నాలతో ఉదయం 5 గంటలకు ఎమర్జెన్సీకి వచ్చింది. కా నీ అక్కడుండే శిక్షణ డాక్టర్లు ఇంజక్షన్ ఇచ్చి బయట కూర్చోబెట్టారు. కారణం ఏంటని అడిగితే ఎక్స్‌రే, అబ్ డామిన్ స్కానింగ్ తీసుకొని రావాలని చెప్పారు. తీరా ఎక్స్‌రే వద్దకు వెళితే అక్కడ ఎవ్వరు లేరు. అబ్‌డామిన్ స్కానింగ్ ఉదయం 10 గంటలకు తెరుస్తారు. దానికి కూడా ముందుగానే టోకెన్ తీసుకోవాలి. ఈ పరిస్థితుల్లో అడ్మిషన్ చేయకుండా ఆ రోగిని అలాగే ఉంచారు. ఇలాంటి ప రిస్థితి ఒక్క బాలమణికే కాదు...

ప్రతీ ఒక్క అడ్మిషన్ రోగికి ఎదురవుతున్నది. పరీక్షలు అయ్యేలోపు ప్రథమ చికిత్స కూడా చేయడం లేదు. అడ్మిట్ చేసుకోవడం లేదు. గంటల తరబడి నరకయాతన అనుభవిస్తూ ఉండాల్సిందే.

సకాలంలో స్పందించని 108..

నారాయణపేట జిల్లా కర్ణాటక సరిహద్దులోని జేగ్రం గ్రామానికి చెందిన సాయిలు ప్రమాదవశాత్తు కింద పడి తలకు గాయం అయ్యింది. దీంతో ఈనెల 21న రాత్రి 10 గంటలకు జనరల్ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీకి వచ్చారు. పరీక్షించిన వైద్యులు న్యూరో డాక్టర్ లేరని హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అయితే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్సులు బిజీగా ఉన్నాయని చెప్పుకుంటూ వచ్చారు.

తీరా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు అంబులెన్స్ వచ్చి హైదరబాద్‌కు తీసుకెళ్లారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఆసుపత్రిలోనే బయట ఓ మూలకు పడుకున్నారు. ప్రతి రోజు రోగుల విషయంలో ఇలానే జరుగుతుంది. దీంతో వారు ప్రైవేటు అంబులెన్సులను ఆశ్రయిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

సమయపాలన పాటించని డాక్టర్లు, సిబ్బంది..

ఆసుపత్రిలో డాక్టర్లు సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 9:30 గంటలకు వచ్చి మధ్యాహ్నం 2 గంటలకు వెళ్లాల్సిన డాక్టర్లు 11 గంటలకు వచ్చి 12 గంటలకే వెళ్లిపోతున్నారు. ల్యాబ్‌లు, ఎక్స్‌రే విభాగం, పరిపాలన విభాగం సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు వెళుతున్నారో తెలియడం లేదు. కొంతమంది బయోమెట్రిక్ వేసి వెళ్లిపోతున్నారు. మరికొందరు డుమ్మాలు కొడుతున్నారు.

తెల్లవారుజాము నుంచే స్కానింగ్‌కు బారులు..

అల్ట్రాసౌండ్ అబ్‌డామిన్ స్కానింగ్(కడుపు స్కానింగ్) కోసం తెల్లవారు జాము 5 గంటల నుంచే క్యూలో నిలబడుతున్నారు. రోజుకు 40 మందికి మాత్రమే టోకెన్లు ఇస్తున్నారు. ఎందుకు అని అడిగితే డాక్టర్లు లేరని చెబుతున్నారు. దీంతో అడ్మిట్ అయిన రోగులకు, దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతిరోజు గొడవలు కూడా జరుగుతున్నాయి.

అస్తవ్యస్తంగా మారిన శానిటేషన్, పేషెంట్ కేర్ వ్యవస్థ...

ఆసుపత్రిలోని శానిటేషన్, పేషెంట్ కేర్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రోగులను వార్డులకు, పరీక్షలకు తీసుకెళ్లడానికి, అత్యవసర విభాగంలో ఎమర్జెన్సీ కేసులను తీసుకురావడానికి పేషెంట్ కేర్ అటెండర్లు ఉండడం లేదు. డ్యూటీకి వస్తున్నారు తప్పా ఎక్కడ పనిచేస్తున్నారో తెలియడం లేదు. రోగి బంధువులే వీల్‌చైర్లు తోపుకుంటూ వెళుతున్నారు. కనీసం వీల్‌చైర్లు కూడా ఉండడం లేదు. ఉదయం 9 గంటలైనా వార్డులు శుభ్రం చేయడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు దుర్వాసన వస్తున్నాయి.

22 రోజుల్లో 194 కేసులు హైదరాబాద్‌కు రెఫర్...

ప్రతి రోజు ఎమర్జెన్సీకి అత్యవసర కేసులు చాలా వస్తున్నాయి. అయితే క్యాజువాలిటీలో శిక్షణ పొందే డాక్టర్లు ఉండడం, వారికి అనుభవం లేకపోవడంతో అరకొర వైద్యం చేస్తున్నారు. తమవద్ద వైద్య సేవలు లేవని, డాక్టర్లు లేరని చెప్పి ఇక్కడ నయం అయ్యే కేసులను కూడా హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారు. ఈనెల 1 నుంచి 22 వరకు 22 రోజుల్లో 194 కేసులను హైదరాబాద్‌కు రెఫర్ చేయడం విశేషం. అందులో చాలా వరకు కేసులు జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, సర్జరీ కేసులు ఉండడం గమనార్హం.

సగరులకు అండగా ప్రభుత్వం





సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి.. మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డికి సగర సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న నాయకులు

▸ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సగరులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అండగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో సగర సంఘం నూతన జిల్లా కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవానికి చిన్నారెడ్డితో పాటు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడారు. భవిష్యత్తులో సగర సంఘం కార్యక్రమాలు సజావుగా జరగాలని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సగరులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తి చేస్తుందని అన్నారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ... ఇటీవల జరిగిన సగర సంఘం ఎన్నికల్లో స్నేహపూర్వకంగా పోటీ జరిగిందని, అందులో జిల్లా అధ్యక్షుడిగా మోడల తిరుపతయ్య సగర, ప్రధాన కార్యదర్శిగా చెన్నరాయుడు సగర, కార్యదర్శిగా సత్యంసాగర్ ఎన్నిక కావడం జరిగిందన్నారు. వారందరికీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. బీసీల కుల గణన చేసి, మేమేంతా.. మాకెంత అనే నినాదంతో ఆర్డినెన్స్ కూడా చేశామన్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సగరులకు సముచిత స్థానం ఇస్తామన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సగరులు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం దేవరకద్ర అని, అలాంటి నియోజకవర్గంలో తన గెలుపుకోసం కృషి చేసిన సగరులు రాజకీయంగా ఎదగడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ.. సగరులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని, సగర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు మోడల తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి చెన్నరాయుడు, కార్యదర్శి సత్యంసాగర్, గ్రంథాలయ చైర్మన్ గోవర్దన్‌సాగర్, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ పగిడాల శ్రీనివాస్, చీర్ల జనార్దన్, చీర్ల చందర్, చీర్ల సత్యంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతకుమార్‌ను అవమానించడం సరికాదు

▸ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనెల శ్రీనివాసులు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనెల శ్రీనివాసులు

పాలమూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో జరిగిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్‌కు జరిగిన అవమానాన్ని బీసీలందరు ఖండించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోనెల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటనలో ఆయన ముందే ఎంపీ డీకే అరుణ సమక్షంలో ఆమె వర్గీయులు శాంతకుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి అవమానించడం సరికాదన్నారు. అంతర్గత వ్యవహారాలను అంతర్గతంగానే పరిష్కరించుకోవాలని దాన్ని బహిరంగం చేయటం సరికాదన్నారు. ఎంపీ డీకే అరుణ 4వేల మెజార్టీతో గెలవటానికి బీసీలే కారణమన్నారు. బీసీలకు క్షమాపణ చెప్పి తప్పును సరిదిద్దుకోవాలన్నారు. పాలమూరు జిల్లాలో బీజేపీ పార్టీ క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పనిచేసిన నాయకుడు శాంతకుమార్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడి ముందే శాంతకుమార్‌ను అవమానించటం సమంజసం కాదని, రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలు బీజేపీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి

▸ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర



అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న అథ్లెటిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ పుట్టి సురేష్ అన్నారు. వరంగల్‌లో ఆగస్టు 2,4 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ అంతర్ జిల్లాల అండర్-14, 16, 18, 20 అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల, మహిళ, పురుషుల జట్ల ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. టోర్నీలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాక్షించారు. ఎంపికైన క్రీడాకారులకు శిబిరం నిర్వహించి ప్రతిభ కనబరిచిన తుది జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీలు శ్రీనివాసులు, పి.శీనివాసులు, రమేష్ బాబు, ఆనంద్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థి మిత్రులు

తెలకపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తెలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993-94వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పోలేపల్లికి చెందిన ఎల్లికంటి శంకర్ పది రోజుల కింద గుండె నొప్పితో మృతి చెందాడు. ఆ బ్యాచ్ వి ద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబానికి రూ. 36,000 ఆర్థిక సహాయం అం దజేశారు. ఈ కార్యక్రమంలో నిరంజన్, రామకృష్ణ పరశురాములు, దేవయ్య, ర వీందర్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.లు బీజేపీకి గుణపాఠం చెబుతా రని హెచ్చరించారు.

పాన్‌గల్ కోటలో వీరగల్లు ప్రతిమ

పాన్‌గల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వీరగల్లులో పులివేట, పంది వేట శిల్పాలు ప్రసిద్ధి. పులుల నుంచి అడవి పందుల నుంచి ప్రజలను రక్షించడానికి గ్రామాల్లోని వీరులు పోరాడి అమరులైనప్పుడు ప్రజలు ఆ వీరుల జ్ఞాపకంగా ఈ వీర శిలలను ఊరి పొలిమేరలో నిలిపేవారు. ఎవరు ఈ శిల్పాలను చూసినా.. ఆ ఊరి వీరుల శౌర్యాన్ని గుర్తు చేసుకుని కీర్తించేవారు. పాన్‌గల్ మండల కేంద్రంలో గిరిదుర్గానికి చాలా ప్రాచీన చరిత్ర ఉంది. ఆ కోటలో అనేక కట్టడాలు, ఫిరంగులతో పాటు ఎన్నో శిల్పాలు, వీరగల్లు విగ్రహాలున్నాయి. కోటలోకి వెళ్తుండగా.. ముళ్లగవిని అనే ప్రదేశం వద్ద దాదాపు నాలుగు అడుగులున్న పులి వేట వీరగల్లు ప్రతిమను తెలంగాణ చరిత్ర బృందం పరిశోధక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, డా.బైరోజు శ్యాంసుందర్ గుర్తించారు. కుడివైపు సిగ, తలపై పాగా, మెడలో కంటె, వీరకాసెతో కనిపిస్తున్న వీరుడు రెండు చేతుల బల్లెంతో పులిని చంపుతున్న దృశ్యం ఒక రాతి పలక మీద చెక్కబడింది. ఈ వీరగల్లు క్రీ.శ. 13, 14వ శతాబ్దాల నాటి శైలిలో చెక్కబడి ఉందని తెలియజేశారు.



పాన్‌గల్ కోటలో గుర్తించిన పులివేట వీరగల్లు ప్రతిమ

ఇంటర్వ్యూ..

అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు

- మంజుల, ఎంపీడీవో, ధరూరు



ధరూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని ఎంపీడీవో మంజుల అన్నారు. నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణాలు చేస్తారని 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రత్యేక అధికారుల పాలన ఎలా కొనసాగుతున్నది?

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. సమస్యలు ఉంటే తమదృష్టికి తెస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

గ్రామాల్లో చెత్త సేకరణ ఎలా కొనసాగుతున్నది?

ప్రస్తుతం గ్రామాల్లో చెత్తసేకరణ పనులు గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో కొనసాగుతున్నది. చెత్తసేకరణ సిబ్బందికి వేతనాలు రాక, కాస్త సమస్య ఏర్పడింది. వీటిపై కూడా దృష్టి సారిస్తున్నాం.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉందా?

గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలేదు. కొద్దిరోజుల క్రితం కొత్తపాలెంతండా, త్యాగదొడ్డి తదితర గ్రామాల్లో పైపులైన్ లీకేజీల కారణంగా నీటి సరఫరా నిలిచింది. ప్రస్తుతం తాగునీటి సరఫరా కొనసాగుతున్నది.

అభివృద్ధి పనులు కొనసాగతున్నాయా?

ప్రస్తుతం మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు అధికారులు శాయశక్తులా కృషి చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్‌కార్డులు, పెన్షన్ ప్రక్రియ, కల్యాణలక్ష్మి తదితర పథకాలు అర్హులకు అందుతున్నాయి.

న్యూస్ బాక్స్

ఆలయం గడప ఏర్పాటుకు ప్రత్యేక పూజలు

గట్టు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దమ్మ అవ్వ గుడి కడప నిర్మాణానికి బల్గెర గ్రామంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హన్మంతునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దమ్మఅవ్వ గుడి ప్రధాన ద్వారం వాకిలి నిర్మాణానికి గ్రామస్థులతో కలిపి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయ కొట్టి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బాసుగోపాల్, హనుమంతు, రజినిబాబు, దేవరింటి పూజారి పాల్గొన్నారు.

'1న ధర్నాను విజయవంతం చేయాలి'

గద్వాలసర్కిల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతమైన ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ ఆగస్టు 1న జిల్లా కేంద్రం గద్వాలలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టే ధర్నాను జిల్లా ప్రతినిధులు, బాధ్యులు, సభ్యులు విజయవంతం చేయాలని ఆదివారం కమిటీ నేతలు గోపాల్, ప్రభాకర్ శాస్త్రి, ఉదయ్‌కిరణ్, ప్రభాకర్, హన్మంతు, హరిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాలఅర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నదిఅగ్రహారం రోడ్డులో ఉన్న 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా ఈనెల 28వ తేదీ సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈ తిరుపతి రావు, ఏడీఈ రమేష్‌బాబు, అయిజ ఏడీఈ గోవిందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసమయంలో బిజ్వారం, కాకులారం, మల్దకల్, మన్నాపురం, ధరూర్ సబ్‌స్టేషన్ (ధరూర్ పట్టనానికి సప్లయ్ ఉంటుంది), గోనుపాడు, శెట్టిఆత్మకూర్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున రైతులు, గృహ, వాణిజ్య, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

ఇటిక్యాల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగాపురం సబ్‌స్టేషన్ పరిధిలో సో మవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయాగ్రామాల ప్రజలు గమనించాలని ఏడీఈ నవీన్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొత్తట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపట్టామని తెలిపారు. చాగాపురం, షాబాద, వల్లూరు, బుడ్డారెడ్డిపల్లి, శనిగపల్లి, బట్లదిన్నె, ఉదండాపురం వినియోగదారులు సహకరించాలని ఏడీఈ, ఏఈ శేఖర్ పేర్కొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

అయిజ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆదివారం ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. టెన్త్ 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, కిష్టన్న, ప్రకాష్, మోజెస్ పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు లేక అవస్థ

» బెటాలియన్ పాఠశాలలో చెట్టుకింద తరగతుల నిర్వహణ » ఐదు తరగతులకు నాలుగే గదులు



బెటాలియన్ పాఠశాలలో చెట్టు కింద తరగతి నిర్వహణ

ఎర్రవల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 10వ బెటాలియన్‌లోని ప్రభుత్వ ఉన్న పాఠశాలకు స్థానికంగా ఉన్న విద్యార్థులే కాక చుట్టుపక్కల దాదాపు ఎనిమిది గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. 6నుంచి 10వ తరగతి వరకు మొత్తం 220 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. తరగతులు ఐదు అయినప్పటికీ నాలుగు గదులే ఉండడంతో ప్రతీ రోజు ఒక తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలోని చెట్టుకింద చదువుకోవాల్సి వస్తున్నది. ప్రస్తుతం వర్షాకాలంలో కావడంతో ఒకే గదిలో రెండు తరగతులను కూర్చోబెట్టడంతో ఇబ్బందిపడుతున్నారు. పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు ఉండడం వల్ల ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. తరగతి గదులు సరిపడా లేకపోవడం వీరికి సమస్యగా మారింది.

నిధులు వెనక్కి..

మండల కేంద్రంలోని పదో బెటాలియన్‌లో కొనసాగుతున్న ఈ పాఠశాలకు అదనపు గదులు నిర్మించి, మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం నుంచి రూ.48 లక్షలు మంజూరైనట్లు తెలిసింది. కానీ రూ.30లక్షలకు మించి చేపటాల్సిన పనులను ప్రభుత్వం టెండర్ ద్వారా చేయిస్తుంది. అలాగే స్థలసేకరణ సమస్య ఉంది. బెటాలియన్ పరిధిలో ఏ పని చేపట్టాలన్నా, కమాండెంట్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారి వరకు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇవేవీ చేయకపోవడంతో నిధులు వెనక్కివెళ్లాయి.

ఒక్క గది అయినా నిర్మించండి

పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవు. బయట చెట్టుకింద నిర్వహించడం కష్టంగా ఉంది. ఒక్క గది నిర్మాణం చేపట్టినా మాకు ఎంతో ఊరటగా ఉంటుంది. అనుమతుల పేరుతో, ఇతర కారణాలతో నిధులు వెనక్కి వెళ్లడం ఇబ్బందిగా మారింది.

- విజయ్‌కుమార్, హెచ్‌ఎం



నడిగడ్డలో విద్యారంగాన్ని పటిష్టం చేయాలి



గద్వాలలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

గద్వాలటౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి విద్యారంగాన్ని పటిష్టం చేసేందుకు కృషి చేయాలని ఏబీవీపీ విద్యార్థులు కోరారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసి వినతి పత్రం ఇచ్చారు. 15ఏళ్ల క్రితం ప్రారంభమైన పాలిటెక్నిక్ కళాశాల, 17ఏళ్ల క్రితం ప్రారంభమైన ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా మహిళల వసతి గృహాలు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్ధాంతరంగా నిలిపివేసిన ఎన్‌సీసీ విభాగాన్ని తిరిగి పునరుద్దరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికితోడు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుపేద విద్యార్థులకు తగిన రవాణా సౌకర్యం లేకపోవడం సమస్యగా మారిందని చెప్పారు. కార్యక్రమంలో ఏబీవీపీ సంభాగ్ ప్రముఖ్ బీజాపూర్ కరేంద్రనాథ్, జిల్లా ప్రముఖ్ ఆంజనేయులు, నాయకులు నరేష్, కావలి ఆంజనేయులు, నరేష్‌పటేల్, సురేష్‌నాయుడు, సాయిహర్ష, రఘువంశీ, తేజ, నజీర్, వీరేష్, వీరేంద్ర, శ్రావణి, శివాని, శిరీష, నేహ, రితిక, పల్లవి ఉన్నారు.

నడిగడ్డ సుభిక్షంగా ఉండాలి

లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులతో నడిగడ్డ ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆకాంక్షించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం పట్టణంలోని పెద్దఅగ్రహారం అహోబిళ మఠం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయనను బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కే.మోహన్‌రావు, చాగాపురం ప్రదీప్‌కుమార్, నందిన్నె ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వెనుకబాటుతనానికి గురైన నడిగడ్డను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకబోర్డు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి డీకే స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు వెంకటాద్రిరెడ్డి, అయ్యపురెడ్డి, రామచంద్రారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ బండల పద్మావతి, మాజీ కౌన్సిలర్ పాండు, బ్రాహ్మణ సంఘం నాయకులు ఉన్నారు.

అంజన్నను దర్శించుకున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ

ఎర్రవల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లి ఆంజనేయస్వామిని ఆదివారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ ఈవో రామన్‌గౌడ్, అర్చకులు మారుతచారి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

మహిళలకు అండగా సఖి సేవలు



సఖి 181 హెల్ప్‌లైన్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

- ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటర్ శోభారాణి
- పోస్టర్‌ను విడుదల చేసిన సిబ్బంది

గద్వాల క్రైం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఎల్లప్పుడు అండగా ఉంటూ మహిళల హెల్ప్‌లైన్ సేవలకై 181 కాల్ చేయాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటర్ శోభారాణి అన్నారు. ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సఖి సెంటర్ సేవలకు సంబంధించి 181హెల్ప్‌లైన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సేవలకై 24/7 అందుబాటులో సఖి సెంటర్ ఉంటుందన్నారు. సఖి సెంటర్‌లో మహిళలకు తాత్కాలిక ఆశ్రయం, వైద్యసహాయం, న్యాయ సహాయం, మనోసామాజిక కౌన్సెలింగ్‌తో పాటు పోలీస్ సహాయం కూడా అందించడం జరుగుతుందన్నారు.

మహిళలు ఏమైనా హింసా సమస్యలు ఎదుర్కొన్నప్పుడు వెంటనే హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సఖి సిబ్బంది ఉన్నారు.

అధ్వాన రహదారులపై రైతుల అవస్థలు



వడ్డేపల్లి శివారులో వర్షాలకు బురదమయంగా మారిన రహదారి

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రమైన వడ్డేపల్లితో పాటు శాంతినగర్, పైపాడు గ్రామాల్లో పొలాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎడ్ల బండిపై ప్రయాణం చేస్తున్నారు. పంచాయతీలుగా ఉన్న ఉన్నప్పుడు కనీసం రహదారులకు మొరం వేసేవారని, మునిసిపాలిటీలోకి మార్చిన తర్వాత మొరం వేయకపోవడంతో వర్షాలకు పూర్తిస్థాయిలో రహదారులు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కనీసం మునిసిపాలిటీ అధికారులకు సమస్యను చెబుతామనుకుంటే వారు గ్రామాలవైపు రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులుదెబ్బతిన్న పొలాల రహదారులకు మొరం వేయించాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



అయిజలో భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అయిజ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు రంగు శ్రీధర్ భూమిపూజ చేశారు. పట్టణంలోని 13వ వార్డులో ఆదివారం ఈకార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాన్యులకు సొంతింటి కల నెరవేర్చటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో దేవరాజు, దేవేంద్ర, జయన్న, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొంకల గ్రామ శివారులోని పొలం గట్టు విషయంలో ఆదివారం హరిజనులు, గౌడకుల యువకులు ఘర్షణపడ్డారు. పొలం గట్టు నరికారని ఒకరిపైఒకరు పరస్పర దాడులు చేసుకున్నారు. కాగా, దాడిలో ఇరు వర్గాలకు చెందిన వారు గాయపడ్డారు. ఈ విషయంపై శాంతినగర్ ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డిని 'ఆంధ్రజ్యోతి'ని సంప్రదించగా ఒకవర్గం వారు ఫిర్యాదు చేశారని, మరోవర్గం వారు ఫిర్యాదు చేసేందుకు వస్తున్నట్లు తెలిపారు.

జనహిత మాసవర్గ సమావేశం

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ గ్రామమైన పైపాడు ఈశ్వరమ్మ ఆలయంలో ఆదివారం జనహిత మాసవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి నాలుగు గ్రామాల మాతాజీలు, పితాజీలు హాజరయ్యారు. ఈసందర్భంగా హిందూమతానికి ఉన్న ప్రాధాన్యతపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పించాలని, భవిష్యత్‌లో సామాజిక సేవా కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని నాయకులు చర్చించారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సంభాగ్ అభియాన్ ప్రముఖ్ శివ, మండల సంఘం అధ్యక్షుడు గాయత్రి శ్రీనివాసులు, కోశాధికారి రాముడు, రవీంద్రఆచారి, పద్మ ఉన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి



అయిజలో ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు

అయిజ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పెట్రోల్, డీసీల్‌తో పాటు వినియోగదారులకు ఉచిత గాలి, మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం అయిజ గద్వాల రహదారిలో ఎస్‌ఆర్‌ఆర్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకును ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

'రాష్ట్ర సేవాదారుల సమస్యలు పరిష్కరించాలి'

ఇటిక్యాల, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల ఆలయాల్లో పనిచేసే సేవాదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ శాసన మండలి సభ్యులు రాంచందర్ రావుకు వినతిపత్రం అందజేశారు.రాష్ట్రంలోని అనేక ఆలయాల్లో దేవీదేవతలకు నిత్యపూజలు నిర్వహిస్తూ, ఆలయ భూములను అనుభవిస్తూ, వంశపారంపర్యంగా సేవలందిస్తున్న వివిధ కులాలకు చెందిన సేవాదారులకు కొన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెద్దదిన్నె ఆలయ ధర్మకర్త జయసింహ వినతిపత్రం అందజేశారు.

ప్రశాంతంగా జీపీవో, సర్వేయర్ల పరీక్ష

● కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్



పరీక్ష కేంద్ర అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పలనాధికారి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం కోసం చేపట్టిన పరీక్షలు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2నుంచి 5 గంటలకు రెండు సెషన్స్‌గా నిర్వహించారు. రెండు సెషన్లకు మొత్తం 151 మంది అభ్యర్థులకుగాను 129 మంది పరీక్ష రాయగా, మిగతా 22 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి కలెక్టర్ బీఎం సంతోష్ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను నిబంధనలకు అనుగుణంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల హాజరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ల వెంట సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ రామచంద్రం, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రేణుకదేవి, పర్యవేక్షకురాలు ప్రియాంక ఉన్నారు. జీపీవో, లైసెన్స్‌డ్ సర్వేయర్ల ప్లాటింగ్ పరీక్ష సందర్భంగా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

మూఢనమ్మకాలు సమాజ పురోగతికి విఘాతం

● జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్



సమావేశంలో మాట్లాడుతున్న జితేందర్

గద్వాలటౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అశాస్త్రీయమైన భావజాలంతో పెరిగిపోతున్న మూఢనమ్మకాలు సమాజ పురోగతికి ఆటంకంగా మారాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జితేందర్ అన్నారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను, వాస్తవిక దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న జనవిజ్ఞాన వేదికకు ప్రజలు అండగా నిలవాలన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రైవేటు సంస్థలో జిల్లా అధ్యక్షుడు రుషిరాజు, ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి, నాయకులు ఉప్పల శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పేరు నరసింహతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చంద్ర మండలంపై స్వేచ్ఛగా సంచరిస్తూ కృత్రిమ గుండెలను అమర్చే స్థాయికి ఎదిగిన నేటి ఆధునిక యుగంలో మూఢనమ్మకాలు పెరిగిపోతుండటం ఆందోళనకరమన్నారు. మూఢనమ్మకాల వల్ల ప్రజల్లో పెరిగిపోతున్న భయాందోళనలు, వాటివల్ల జరుగుతున్న అనర్థాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. జిల్లాలోని విద్యావంతులు, మేధావులు, అభ్యుదయవాదులు, విజ్ఞానవంతులు పెద్దసంఖ్యలో జనవిజ్ఞాన వేదికలో చేరాలని కోరారు.

కరాటేతో ఆత్మరక్షణ, క్రమశిక్షణ



బెల్టుల ప్రదానం అనంతరం తైక్వాండో విద్యార్థులు

అయిజ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో క్రీడతో విద్యార్థులలో ఆత్మరక్షణ, క్రమ శిక్షణ అలవడుతుందని అయిజ ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం అయిజ పట్టణంలోని శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాలలో నారాయణ్ తైక్వాండో అకాడమి శిక్షకుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో, సీనియర్ మాస్టర్ శ్రీహరి పర్యవేక్షణలో 100 మంది తైక్వాండో విద్యార్థులకు బెల్ట్ ఎగ్జామ్స్ నిర్వహించటం జరిగింది. ప్రమోషన్ పొందిన విద్యార్థులకు ఎస్‌ఐ చేతులమీదుగా బెల్టులు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలుగుచేస్తాయని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని తెలపటం జరిగింది.

ప్రతీవ్యక్తి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. క్రమశిక్షణ, మంచి నడవడికను అలవరచుకోవాలని సీనియర్ మాస్టర్ మధుకుమార్, రమేశ్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ సుధీర్, రవి, నవదీప్, అనూశ్, అంజి పాల్గొన్నారు.

'నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు'

మానవపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు అతిక్రమించి నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జాతీయ రహదారి 44 మానవపాడు స్టేజీ సమీపంలో వాహనాలు తనిఖీచేశారు. ఆటోల్లో, టాటామ్యాజిక్ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం చేయడం ప్రమాదమని డ్రైవర్లకు చెప్పారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉండాలని, 18 సంవత్సరాలు నిండని చిన్నారులకు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన కాలనీవాసులు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

వడ్డేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని రామచంద్రనగర్ కాలనీవాసులు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డు ఎక్కి నిరసన తెలిపారు. ఐదురోజులుగా నీరు రాకపోవడంతో తాగేందుకు, స్నానాలు చేసేందుకు, కనీస అవసరాలకు నీరు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ అధికారులు ఏ మాత్రం స్పందించడం లేదని వారు ఆరోపించారు. సమస్యలపై అధికారులకు అడిగితే మోటారు మరమ్మతులు చేస్తున్నాయని చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. నీరు సరఫరా కానప్పుడు తమకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని, ఇలా అదిగో ఇదిగో వస్తున్నాయంటూ చెప్పడం సరికాదన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు భార్గవ్‌యాదవ్, గడ్డం శ్రీను ప్రజల ఇబ్బందులను గమనించి మునిసిపాలిటీ ఏఈ, అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు.

ట్యాంకర్‌తో నీటిని వెంటనే అందజేయాలని చెప్పగా, అధికారులు ట్యాంకర్ ద్వారా నీటి అందించడంతో స్థానికులు నిరసన విరమించారు. నీటిని అందించడంలో చొరవ తీసుకున్న నాయకులకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు